వేదికపై నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

- 44ఏండ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ముస్తాబాద్, మార్చి 31: వారంతా పదో తరగతి వరకు ఒక్కచోట చదివారు. ప్రస్తుతం ఉద్యోగ, వ్యాపారరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 44ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులంతా (1979-80లో ఎస్సెస్సీ) ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరి కొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సరదాగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఇక్కడ ముస్తాబాద్ బాలికల పాఠశాల హెచ్ఎం రవీందర్, రిటైర్డ్ ఎంఈవో పరశురాములుగౌడ్, నాటి వ్యాయామ ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, అటెండర్ రాములు, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

వేములవాడ రూరల్: ఎదురుగట్లలో బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న గోపా అసోసియేషన్ సభ్యులు

వేములవాడ రూరల్, మార్చి 31: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్లకు చెందిన పొన్నం పరశురాంగౌడ్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి గోపా అసోసియేషన్ సభ్యులు ₹70వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ₹10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని గోపా నాయకులు కోరారు. ఇక్కడ రాష్ట్ర గౌడ యూనిఫామ్ అసోసియేషన్ సభ్యుడు, సీఐ రాజమౌళి, రిటైర్డ్ సీఐ బుచ్చిరాములు, నాగన్నగౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు దూలం సంపత్‌గౌడ్, వికృతి లక్ష్మీ నారాయణ, కైరి లింగయ్య ఉన్నారు.

ముస్తాబాద్, మార్చి 31: మండల కేంద్రానికి చెందిన చింతోజు బ్రహ్మం కుటుంబానికి శ్రీ శివకేశవ చిట్టి సభ్యులు ₹5వేలు అందించారు. మద్దికుంటకు చెందిన బట్టు నగేష్, ధనుకుల స్వామి కుటుంబాలకు ₹5వేల చొప్పున అందించారు.

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: బండలింగంపల్లిలో కొండాపురం శేఖర్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని జంగ రెడ్డి యూత్ అసోషియేషన్ సభ్యులు పరామర్శించారు. వారివంతుగా సదరు కుటుంబానికి ₹21వేలు అందించారు.

కోనరావుపేట, మార్చి 31: బావుసాయిపేటలో నిరుపేద కుటుంబానికి యూత్ సభ్యులు చేయూతనందించారు. వడ్నాల సతీష్ పక్షవాతంతో బాధపడుతుండగా, బాధిత కుటుంబానికి గ్రామ యూత్ సభ్యులంతా కలిసి ₹40వేలు పోగుచేసి అందించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

రైతులతోనే సహకార సంఘం అభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రామ్మోహన్‌రావు

కోనరావుపేట, మార్చి 31: రైతులతోనే సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్ రావు పేర్కొన్నారు. కొలనూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే సింగిల్ విండో పరిధిలోని గ్రామాల్లో రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఇక్కడ వైస్ చైర్మన్ కాశవేని మహేశ్‌యాదవ్, డైరెక్టర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చిక్కాల పరామర్శ

ఇల్లంతకుంట: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

ఇల్లంతకుంట, మార్చి 31: రామోజీపేట గ్రామానికి చెందిన కేశవేని శ్రీనివాస్, ఆంజనేయులు తల్లి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కస్తూరి తిరుపతిరెడ్డి ఉన్నారు.

సిరిసిల్ల రూరల్, మార్చి 31: తంగళ్లపల్లి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ తాజొద్దీన్ తండ్రి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు మాట్ల మధు, షరీఫ్, బొడ్డు శ్రీధర్, అఫ్రోజ్ ఉన్నారు.

'కోడ్' ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలి

- 'సీ-విజిల్' యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, మార్చి 31: ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ప్రజలు వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫొటోలు, వీడియోలను తీసి సీ-విజిల్ యాప్ ద్వారా పంపాలని తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసినా, పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు వంటి వివరాలను, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా ఫిర్యాదు చేయాలని సూచించారు. సీ-విజిల్ యాప్‌ను తమ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, 24 గంటలు కలెక్టరేట్‌లో సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ జరుగుతుందన్నారు.

కలెక్టర్ అనురాగ్ జయంతి

ఫిర్యాదు చేసిన వారి పేర్లు, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, మార్చి 31: సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ఔట్‌సోర్సింగ్‌లో ఉన్న పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కమాండెంట్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మసిస్ట్-2, బార్బర్-2, దోబీ-3, ఆఫీస్ సబార్డినేట్ 2, పారిశుధ్య కార్మికులు-3, స్వీపర్-5, హెల్త్ అసిస్టెంట్-2 పోస్టుల కోసం పురుష అభ్యర్థులు ఈ నెల 4లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లపై చర్యలు

గంభీరావుపేట, మార్చి 31: సెస్ అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సెస్ ఏఈ రుషిక ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మానేరు వాగు సమీ వ్యవసాయ విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇంకా మండలంలో ఎవరైనా ఉంటే సెస్ ద్వారా కనెక్షన్లు మంజూరు చేసుకొని పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఎవరూ కూడా అక్రమంగా విద్యుత్ వినియోగానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అన్యాక్రాంతంపై అభ్యంతరం

దుమాలలోని పెద్ద చెరువు వద్ద అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

- పెద్ద చెరువు భూమి చదునుకు యత్నం
- అడ్డుకున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: దుమాల-అక్కపల్లి శివారులోని పెద్ద చెరువుకు సంబంధించిన భూమిని ఓ వ్యక్తి చదును చేస్తుండగా, దుమాలకు చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం అడ్డుకున్నారు. కొన్ని రోజులుగా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తాను కొనుగోలు చేసిన భూమిని చదును చేసే క్రమంలో చెరువుకు సంబంధించిన భూమిని కూడా చదును చేస్తున్న విషయం ముదిరాజ్‌లకు తెలిసింది. చెరువు మొత్తం 83ఎకరాల విస్తీర్ణంలో ఉందని, సదరు భూమిని చదును చేయడం అక్రమమని వారు అడ్డుకున్నారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో భూమిని చదును చేయవద్దని అధికారులు హెచ్చరించడంతో పనులు నిలిచిపోయాయి.

ఆనందరెడ్డికి 'స్వర్ణ నంది'

ఆనందరెడ్డికి నంది అవార్డును ప్రదానం చేస్తున్న లంబోదర కల్చరల్ అకాడమీ, మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు

వేములవాడ టౌన్, మార్చి 31: లంబోదర కల్చరల్ అకాడమీ, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజన్న సన్నిధిలోని కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఆనందరెడ్డికి జాతీయస్థాయి ఉగాది స్వర్ణనంది అవార్డు అందజేశారు. ఆనందరెడ్డి సేవలకు గుర్తింపుగా అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కళాభవన్‌లో నిర్వహించిన నేషనల్ లెవల్ మ్యూజిక్, డ్యాన్స్ ఫెస్టివల్‌లో చిన్నారులు పాల్గొని సందడి చేశారు. ఇక్కడ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు మధు మహేశ్, ఘంటసాల పవన్‌కుమార్, రాజస్వరూప్, తాడి రమేశ్, రాజారాం, ఏర్పుల శ్రీనివాస్, రేవతి ప్రసాద్, రాజ్‌కుమార్, తులసి, ప్రసాద్, సగ్గు రాహుల్, పాత సంతోష్, ప్రతాప నటరాజ్, పసుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పన్ను వసూళ్లలో 'సిరిసిల్ల' ఫస్ట్

రాజన్న సిరిసిల్ల, మార్చి 31 (నమస్తే తెలంగాణ): గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో మెరిసిన సిరిసిల్ల జిల్లా, ఈ యేడు ఆస్తి పన్ను వసూళ్లలో ఫస్ట్ ప్లేస్‌లో నిలించింది. 255 గ్రామ పంచాయతీల్లో 98.19 శాతంతో 32 జిల్లాల్లోనే నంబర్‌వన్ స్థానం దక్కించుకున్నది. చిన్న జిల్లా అయిన రాజన్నసిరిసిల్ల అభివృద్ధి, స్వచ్ఛతలో జాతీయ, రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలుస్తున్నది. పంచాయతీల్లో 98.19 శాతంతో జిల్లా రికార్డు సృష్టించగా ఇందుకు సహకరించిన ప్రజలు, సిబ్బందికి కలెక్టర్ అనురాగ్ జయంతి కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్‌లో వందశాతం..

సిరిసిల్ల టౌన్, మార్చి 31: మున్సిపల్ పరిధిలో వందశాతం ఆస్తి పన్ను వసూళ్లు పూర్తి అయినట్లు కమిషనర్ లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం 2023-24లో భాగంగా ₹ 6.12 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

'నవోదయ'కు ఎంపిక

రుద్రంగి/కోనరావుపేట, మార్చి 31: జిల్లాలోని పలు పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యారు. రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్‌స్కూల్ విద్యార్థులు ఎర్రం తనుశ్రీ, ఒడ్డారపు హరిణి ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే కోనరావుపేట మండలం సుద్దాలలోని ఖుషివాణి ప్రైవేట్ విద్యార్థి కే రాఘవతేజ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. రాఘవతేజను హెచ్ఎం, గ్రామస్తులు అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు చెల్లించాలి

వీర్నపల్లి, మార్చి 31: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, ఇతర బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ చాకలి భాగ్య, మల్లారం లక్ష్మి, గౌరి, లక్ష్మీరాజవ్వ, గంగవ్వ ఉన్నారు.

కమ్యూనిటీ హెల్త్ క్యాంపు విజయవంతం

సిరిసిల్ల రూరల్, మార్చి 31: మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో పద్మశాలీ ఆఫిషియల్స్ అండ్ ప్రొహెషనల్స్ (పోపా) రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ హెల్త్ క్యాంప్‌నకు అనూహ్య స్పందన లభించింది. సరయూ దవాఖాన, పోపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపులో 500పైగా మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇక్కడ పోపా ప్రధాన కార్యదర్శి పున్నం చందర్, నాయకులు అలువాల ఈశ్వర్, వాసాల హరిప్రసాద్, బొల్లి భగవాన్,కోడం రాంప్రసాద్, దాసరి తిరుమల, గాదర్ల మోహన్, గాజుల ప్రతాప్, దూస రఘుపతి, దూస శ్రీనివాస్, గడీల రమేశ్, కారంపుడి రాజేశం, ద్యావనపల్లి పరమేశ్వర్, శివరాత్రి శ్రీనివాస్, కాశీరాం, కనుకంట్ల మధు, గడ్డం సత్యం, బైరి రవీందర్, సభ్యులు ఉన్నారు.

'నవోదయ'కు ఎంపిక

రుద్రంగి/కోనరావుపేట, మార్చి 31: జిల్లాలోని పలు పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యారు. రుద్రంగిలోని కృష్ణవేణి టాలెంట్‌స్కూల్ విద్యార్థులు ఎర్రం తనుశ్రీ, ఒడ్డారపు హరిణి ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, డైరెక్టర్లు అభినందించారు. అలాగే కోనరావుపేట మండలం సుద్దాలలోని ఖుషి వాణి ప్రైవేట్ విద్యార్థి రాఘవతేజ నవోదయ పాఠశాలకు ఎంపికకాగా, హెచ్ఎం అభినందించారు.

యువకుడి బలవన్మరణం

రుద్రంగి, మార్చి 31: ప్రియురాలి కుటుంబ సభ్యులు వేధింపులతో మానాల గ్రామానికి చెందిన శివకుమార్(23) శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శివకుమార్ కుటుంబ సభ్యులు బతుకుదెరువు కోసం మానాలలో స్థిరపడ్డారు. శివకుమార్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరంకు చెందిన యువతిని ప్రేమించాడు. వారి కుటుంబ సభ్యులు శివకుమార్‌పై మహేశ్వరం పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. యువతి కుటుంబ సభ్యులు వేధించడంతో తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని, శివకుమార్ తల్లి కొమురవ్వ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఈ ఠాణాలో ఏం జరుగుతున్నది?

- వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఎనిమిది రోజుల్లో 13 మందిపై వేటు
- తాజాగా అవినీతి ఆరోపణలతో సీఐ సస్పెన్షన్
- ఈ వ్యవహారంపై సర్వత్రా చర్చ

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ కార్యాలయం

వేములవాడ, మార్చి 31: ఈ ఠాణాలో ఏం జరుగుతున్నది. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం చర్చనీయాంశమైంది.. ఇటీవల 13 మందిపై బదిలీ వేటు వేయగా తాజాగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ)పై వేటువేయడం కలకలం రేపుతున్నది. అవినీతి మరకలతోనే వీరిపై శాఖపరమైన చర్యలు చేపట్టినట్లు తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లాలోని వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న పరిణామాలపై పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. రాజన్న కొలువైన వేములవాడలో విధులు నిర్వర్తించాలని పోలీసు, ఇతర శాఖల అధికారులు ఆసక్తి చూపుతుంటారు. అయితే ఇక్కడి పట్టణ ఠాణాలోని సిబ్బంది, అధికారులపై స్వల్ప కాలంలో బదిలీలు, సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. 2011లో ఎస్‌హెచ్‌వోను సీఐ స్థాయి కి పెంచారు. ఇక 2015 సంవత్సరం వరకు పనిచేసిన రమేశ్ సీఐ ఇదే తరహాలో అనేక ఆరోపణలు ఎదుర్కొని ఏడాది పూర్తి కాకుండానే బదిలీ వేటుపడింది. ఆ తర్వాత మళ్లీ 2024లో 9ఏళ్ల తర్వాత అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంతో మరోసారి వేములవాడ పట్టణ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన కరుణాకర్‌ను సస్పెండ్ చేశారు. కేవలం 9 మాసాలు మాత్రమే పనిచేసిన కరుణాకర్ పై ఆరోపణలు రావడంతో పాటు కిందిస్థాయి సిబ్బందిపై కూడా ఎస్పీ అఖిల్ మహజన్ వేటు వేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మార్చి 22న వేములవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్‌తో పాటు బ్లూ కోల్ట్స్‌కు చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లతో పాటు ఐదుగురు హోంగార్డులపై ఎస్పీ వేటు వేశారు. ఇదే సమయంలో సీఐ పనితీరుపై చార్జి మెమో ఇచ్చారు. జిల్లా పోలీస్ బాస్ విచారణలో మరో వారం గడువక ముందే మరో ఇద్దరు పోలీసులను హెడ్ క్వార్టర్ అటాచ్ చేయగా ఎస్‌హెచ్‌వోపై వేటుపడడం చర్చనీయాంశంగా మారింది.

విలేకరులమంటూ వసూళ్లు

- చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన ఐదుగురిపై కేసు
- ఒకరి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 31: విలేకరులంటూ ఓ లారీని అడ్డగించి వసూళ్లకు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. మార్చి 30న వేములవాడలోని వరలక్ష్మి రైస్‌మిల్లు నుంచి 600 వడ్ల బస్తాలతో సిద్దిపేటకు వెళ్తున్న లారీని ఐదుగురు (పొన్నం చంద్రమౌళి, దూస రాజేందర్, చౌటపల్లి వెంకటేశ్, ఆవునూరి ప్రశాంత్, నరేశ్) జిల్లెల్ల వరకు వెంబడించారు. తాము విలేకరులమని.. తమకు డబ్బులు ఇవ్వాలని.. లేదంటే సంబంధిత అధికారులకు చెప్పి కేసు నమోదు చేస్తామని బెదిరించారు. దీంతో వేములవాడలో ఉన్న రైస్‌మిల్లు యజమాని వెంటనే జిల్లెల్లకు చేరుకొని వారికి ₹20వేలు ఇచ్చి, తంగళ్లపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు నమోదు చేశారు. పొన్నం చంద్రమౌళిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి ₹20వేలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. పరారీలో ఉన్న మిగతా నలుగురు విలేకరులను త్వరలోనే పట్టుకున్నామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే లేదని హెచ్చరించారు.

ఎమ్మెల్యే సంజయ్‌కి పరామర్శ

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడ/వేములవాడ రూరల్, మార్చి 31: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తండ్రి హనుమంతరావు ఇటీవల మృతిచెందగా, ఆదివారం జగిత్యాలలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో మ్యాకల సింగరయ్య కుటుంబాన్ని ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మ్యాకల శ్రీనివాస్, నల్ల సతీష్‌రెడ్డి, సాయి గౌడ్, మనోహర్, మహేందర్, లక్ష్మణ్, ప్రశాంత్, అంజి, పరశురాములు ఉన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన విప్

రుద్రంగి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

రుద్రంగి, మార్చి 31: మండల కేంద్రంలో ఆదివారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకుప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. మత సామరస్యాన్ని పెంచేందుకే ఇఫ్తార్ విందులు దోహదపడుతాయని విప్ పేర్కొన్నారు. ఇక్కడ నేతలు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, చెలుకల తిరుపతి, గండి నారాయణ, ఇప్ప మహేశ్ ఉన్నారు.

కోనరావుపేట, మార్చి 31: రామన్నపేట ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఇక్కడ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పాషా, యూత్ మండలాధ్యక్షుడు బొర్ర రవీందర్, నేతలు గంగాధర్, తాళ్లపల్లి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు

బోయినపల్లి, మార్చి 31: మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు, గ్రూప్ రాజకీయాలు బయటపడ్డాయి. ఆదివారం నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అధ్యక్షుడిని మార్చాలంటూ కొందరు నాయకులు పట్టుపట్టారు. మరికొందరు దీనిపై వివాదం అవసరం లేదని, మార్పు అవసరం లేదని పట్టుపట్టారు. దీంతో కార్యకర్తలు రెండు వర్గాలుగా వీడిపోయి, ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో జిల్లా, మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగిసిన శివకల్యాణ మహోత్సవాలు

మండపంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐదు రోజులుగా రాజన్న ఆలయంలో ఘనంగా నిర్వహించిన శివకల్యాణ మహోత్సవాలు అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం స్వామివారికి స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాల పూజలు చేశారు. అలాగే రాజన్న ఆలయంలో స్వామివారిని ఎనిమిది వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, ఆర్జిత సేవల ద్వారా సుమారు ₹9లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు.

– వేములవాడ టౌన్, మార్చి31

ఠాణాకొచ్చిన మహిళపై వెకిలీ మాటలు!

- చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ నిర్వాకం
- నాలుగురోజుల తర్వాత వెలుగులోకి ఘటన
- గోడువెళ్లబోసుకున్న బాధితురాలు

చందుర్తి,మార్చి 31: న్యాయం చేయాలని ఠాణా మెట్లెక్కిన ఓ మహిళకు చుక్కెదురైంది. కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసిన ఆమెతో ఓ కానిస్టేబుల్ వెకిలీ మాటలతో ఇబ్బందులకు గురిచేశాడు. చందుర్తి పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటన నాలుగురోజుల తర్వాత వెలుగు చూసింది. బాధిత మహిళ ఆదివారం ఠాణా ఎదుట మీడియాతో గోడు వెళ్లబోసుకున్నది.. చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లెకు చెందిన కట్కూరి లక్ష్మి మార్చి 24న తన ఇంటి ఎదుట పైప్‌లైన్ మరమ్మతుల విషయంలో పంచాయతీ కార్మికుడు భూమయ్యకు మధ్య గొడవ జరిగింది. వరుసకు మరిది అయిన భూమయ్య పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని లక్ష్మిపై తాటిమట్టతో దాడి చేశాడు. దీంతో అదేరోజు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో తిరిగి 27న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ ఓ కానిస్టేబుల్ నీకు దెబ్బలు ఎక్కడ తగిలాయని చూపించాలని అడిగాడు. దీంతో తనకు వీపులో తాకిందని మహిళా పోలీసులకు చూపిస్తానని అనడంతో అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. నీకు దెబ్బ ఎక్కడ తగిలింది..వట్టిగనే చెబుతున్నావా అని వెకిలీగా మాట్లాడాడని ఆరోపించింది. తన భర్త కన్నయ్య కరోనాతో మృతి చెందాడని, తనకు మరిదితో ప్రాణ భయం వుందని న్యాయం చేయాలని కోరింది. ఈ విషయమై చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ ను వివరణ కోరగా లక్ష్మి ఫిర్యాదు మేరకు భూమయ్యపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.